క్లుప్తంగా

ప్రేమ పెళ్లి వద్దన్నందుకు..



బ్లేడుతో గొంతు కోసుకున్న షాబీర్ అలీ

ఆదోని అర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన షాబీర్ అలీ అనే యువకుడిని కుటుంబసభ్యులు ప్రేమ పెళ్లి వద్దనడంతో బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు అన్న అబ్దుల్లా పోలీసులకు తెలిపిన వివరాలు.. షాబీర్‌అలీ ప్రేమవివాహం చేసుకుంటానని ఆదివారం కుటుంబ సభ్యులకు తెలపగా వారు నిరాకరించారన్నారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. 2 లక్షలు విరాళం

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి మఠంలో బంగారు రథోత్సవానికి బెంగళూరుకు చెందిన కమ్మలమ్మ కుటుంబసభ్యులు రూ.2 లక్షలు విరాళంగా అందించినట్లు శ్రీ మఠం అధికారులు తెలిపారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మఠం నిర్వాహకులు వారికి స్వామి వారి మెమెంటో, ఫలమంత్రాక్షింతలు అందజేశారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోనిలో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విద్యార్థులకు లీడింగ్ ఏ లైట్స్ స్కూల్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. విద్యానికేతన్ పరివార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, టాలెంట్ పరీక్షలపై అవగాహన కల్పించారు. భయం వీడి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, పాఠాంశాలను సులువుగా నేర్చుకునే విధానం తదితర విషయాలను వివరించారు. నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలీంసిద్దిఖీ, ఉపాధ్యాయులు జుబేర్, సొసైటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



నిప్పంటుకుని మంటలు చెలరేగుతున్న దృశ్యం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో గడ్డివామికి నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన కొడికి లింగన్న అనే రైతు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. పశు పోషణ కోసం 10 ఎకరాల వరి గడ్డిని నెలరోజుల క్రితం ఎకరం రూ.9 వేలు చొప్పున కొనుగోలు చేసి ఇంటి ఆవరణలో నిల్వ చేసుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు పెట్టారు. మంటలు చెలరేగడంతో స్థానికులు నీటితో ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. గడ్డివాము పూర్తిగా కాలిపోయి సక్కనే ఉన్న బైక్ కూడా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఆదోని ఫైర్ సిబ్బంది వాహనంతో వచ్చి మంటలు అదుపుచేశారు. ఈలోగానే గడ్డివాము పూర్తిగా కాలిపోయి రూ.2 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

గోపుర కలశాల ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కోసిగి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కురువ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ భీరప్ప స్వామి నూతన గోపుర కలశాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో అర్చకులు పూజారి మల్లయ్య స్వామి నేతృత్వంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, మహా మంగళ హారుతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తాదులు మొక్కుబడి తీర్చుకుంటూ ఆలయ గోపురానికి కొత్తగా ఆరు కలశాలు విరాళంగా అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మేళతాళాలు, డప్పువాయిద్యాలు, మహిళలు కలశాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. త్వరలోనే భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కలశ స్థాపన చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఆదుకునే వాడే ఆపద్బాంధవుడు

- రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు సాయం చేస్తే వేధింపులు ఉండవు
- సుప్రీంకోర్టు సరికొత్త మార్గదర్శకాలు
- గోల్డెన్ అవర్‌లో రక్షిస్తే అవార్డులు, రివార్డులు – ఆర్టీఓ



బైకిస్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు (ఫైల్ ఫొటో)

ఆదోని అర్బన్: రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు సాయం అందించేందుకు ఇప్పటివరకు ప్రభుత్వ నిబంధనలు గుదిబండగా ఉండేవి. ఈ తలనొప్పి మాకెందుకులే అంటూ బాధితులను ఆదుకునేందుకు ప్రజలు వెనుకడుగు వేసేవారు. ఇకపై ప్రమాద బాధితులకు సాయం చేసేవారిని ఎలాంటి వేధింపులకు గురిచేసేందుకు వీల్లేదు. వివరాలు సైతం గోప్యంగా ఉంచుతారని అధికారులు చెబుతున్నారు.

రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణమైంది. ఎంతో మంది తీవ్ర గాయాలపాలై అత్యవసర సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదం జరిగిన గంటలోపు క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తే వారిని బతికించేందుకు వీలుంటుంది. బాధితుల అత్యవసర పరిస్థితి చూసి ఎవరైనా ఆస్పత్రిలో చేర్పిస్తే నిబంధనల మేరకు విచారణ పేరిట పోలీసుల వేధింపులు ఎదురయ్యేవి. వివరాలు సేకరించేందుకు గంటల తరబడి నిలిపివేసేవారు. ఇది చాలదన్నట్లు కేసులు అంటూ కోర్టుల చుట్టూ తిప్పేవారు. దీంతో ఈ తలనొప్పి తమకెందుకు అని ప్రజలు వెనుకడుగు వేసేవారు. అందుకే రక్షించడానికి అవకాశం ఉన్నా గతంలో ఎవరూ బాధ్యత తీసుకునేందుకు సిద్ధపడేవారు కాదు.

గెజిట్ నోటిఫికేషన్ ద్వారా....

రోడ్డు ప్రమాదంలో బాధితులకు తక్షణ సాయం అందించి, సమీపంలోని ఆస్పత్రికి తరలించేందుకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కేంద్ర ప్రభుత్వం సరికొత్త నిబంధనలతో సుప్రీంకోర్టు 2016 జనవరి 21వ తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ రాజధాని ఢిల్లీకి చెందిన 'సేవ్ లైఫ్' స్వచ్ఛంద సంస్థ ప్రమాద బాధితులకు సాయం అందించేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీని ప్రకారం ప్రమాద బాధితులను ఆస్పత్రిలో చేర్పించిన వారి వివరాలను తప్పనిసరిగా తెలపాల్సిన అవసరం లేదు. వారు స్వచ్ఛందంగా కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబుతామంటేనే పోలీసులు వారి వివరాలను నమోదు చేసుకోవాలి. లేనిపక్షంలో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి రక్షకులు వెళ్లిపోవచ్చు.

ప్రమాదాల్లో యువకులే ఎక్కువ

రోడ్డు ప్రమాదాల్లో యువకులే ఎక్కువ శాతం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు జిల్లాలో 2020–21లో 1,185 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 620 మంది మరణించారు. 1,428 మంది క్షతగాత్రులుగా మిగిలారు. 2021–22 నవంబర్ వరకు 850 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, 800 మంది క్షతగాత్రులు కాగా 400 మంది మృతి చెందారు. అలాగే సబ్‌డివిజన్ పరిధిలో 2022 నవంబర్ నుంచి ఈ యేడాది జనవరి వరకు 110 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా, అందులో 120 మంది చనిపోయారు. 71 మంది గాయాలపాలయ్యారు. అదేవిధంగా 118 చిన్న చిన్న రోడ్డు ప్రమాదాల్లో 218 మంది గాయాలకు గురయ్యారు.

భయం భయంతో రక్షించా



ఆలూరు రోడ్డులో ఉన్న బ్రిడ్జిని ఢీకొని ఎమ్మిగనూరుకు చెందిన ఓ బైకిస్టు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. క్షతగాత్రుడిని రక్షించాలని ఉంది. అయితే పోలీసులు తనపై కేసు పెట్టి పోలీస్‌స్టేషన్, కోర్టు చుట్టూ తిప్పుతారేమోనని భయం వేసింది. అయినా ప్రాణాపాయంలో ఉన్న వ్యక్తిని కాపాడాలన్న ఉద్దేశంతో భయం పక్కనపెట్టి యువకుడిని ఆస్పత్రిలో చేర్పించా. ప్రస్తుతం యువకుడు కోలుకోవడం సంతోషంగా ఉంది. రక్షించిన వారిని ఇబ్బందులకు గురిచేయరాదనే గెజిట్ విడుదలైనట్లు అప్పుడు తెలియదు. గెజిట్‌పై అధికారులు అవగాహన కల్పించాలి.

– సుదర్శన్, ఆదోని వాసి

కాపాడిన వారికి నగదు ప్రోత్సాహం



ఎక్కడైనా, ఎప్పుడైనా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని సమీపంలోని ఆస్పత్రిలో చేర్చడం ద్వారా బాధితుడు కోలుకుంటే రక్షకుడికి రూ.5 వేలు పారితోషికం అందిస్తాం. పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉంటాయోనని భయాందోళన చెందాల్సిన పనిలేదు. క్షతగాత్రుడిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వివరాలు, చిరునామా చెప్పి వెళ్లిపోవచ్చు. వైద్యులు చికిత్స చేసేందుకు నిరాకరించినా, రక్షించిన వ్యక్తిని పోలీసులు వేధింపులకు గురిచేసినా చర్యలు తీసుకుంటాం. గెజిట్ నోటిఫికేషన్‌పై ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రి, పోలీసు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– వినోద్‌కుమార్, డీఎస్పీ

గుడ్ సమారిటన్



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని గోల్డెన్ హవర్‌లో ఆస్పత్రిలో చేర్పించడమే గుడ్ సమారిటన్ అని సుప్రీంకోర్టు గెజిట్ విడుదల చేసింది. అత్యవసర సాయం అందించిన వారికి అవార్డులు, రివార్డులు కూడా ఉంటాయని గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. గుడ్ సమారిటన్‌పై ప్రత్యేకంగా ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– శివారెడ్డి, ఆర్టీఓ

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామం సమీపంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన ఎల్లప్ప అనే వ్యక్తి ఆదివారం ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు మాధవారం పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి డ్రైవర్‌ను అరెస్ట్ చేసి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు వెల్లడించారు.

ఓపెన్ ఇంటర్ సువర్ణావకాశం

కౌతాళం: ఓపెన్ ఇంటర్మీడియెట్ ద్వారా విద్యార్థులు చదువు కొనసాగించవచ్చని కౌతాళం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ సూచించారు. ఆయన మాట్లాడుతూ.. చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ ఇంటర్ అవకాశాన్ని వినియోగించుకుని పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావొచ్చన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆలాగే ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తాం

కౌతాళం: స్వచ్ఛమైన తాగునీటిని అందించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. ఆదివారం గ్రామంలోని ప్రధాన ట్యాంకు, బొగురప్ప డ్రాప్ వద్ద ఉన్న ఓహెచ్‌ఆర్‌ఎస్ ట్యాంకును, అలాగే కామవరం రస్తాలోని ట్యాంకులను శుభ్రపరిచినట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేపట్టి నీరు కలుషితం కాకుండా చూస్తున్నామన్నారు. పంచాయతీ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామ ప్రజలు పన్నులను ఎప్పటికప్పుడు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

నాడు దుస్థితి – నేడు ప్రగతి



వీధి మధ్యలో ప్రవహిస్తున్న మురుగు నీరు,



రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేసిన కొండుగానీ వీధి

కోసిగి: మండల కేంద్రంలోని కొండుగానీ వీధిలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సహకారంతో మండల గ్రాంటుతో డ్రయినేజీ, సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో గ్రామస్తుల సమస్యలు తొలగిపోయాయి. టీడీపీ కంచుకోటగా ఉన్న కాలనీలో చాలాకాలంగా డ్రయినేజీ, సీసీ రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్ల మధ్య వీధుల్లోనే మురుగు నీరు పారుతూ అధ్వానంగా ఉండేది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలనీ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పార్టీలకు అతీతంగా కాలనీలో డ్రయినేజీ కాల్వలు, సీసీ రోడ్డు వేయించారు. దీంతో కాలనీ సుందరంగా కనిపిస్తోంది. సమస్య పరిష్కరించేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘంటసాల పాటలు మధురాతిమధురం



ఘంటసాల పాటల కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, గాన ప్రియులు

ఆదోని అర్బన్: ఘంటసాల పాటలు ఎంతో మధురాతిమధుర మైనవని, వింటే మనస్సుకు హాయి కలిగిస్తుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక శ్రీ మంగళ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 101వ జయంతి పురస్కరించుకుని అఖిల్ సినీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో 'సినీ సంగీత విభావరి' కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవరాజ్, ప్రముఖ డాక్టర్ గోపీనాథ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం కొన్ని పాటలు వింటుంటే అర్థరహితంగా ఉన్నాయన్నారు. ఘంటసాల పాటల్లో ప్రతి పదం, ప్రతి చరణం ఎంతో విజ్ఞతగా, వినసొంపుగా, అర్థవంతంగా ఉన్నాయని చెప్పారు. ఘంటసాల ఎందరో గాయకులకు ఆదర్శంగా నిలిచారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం గాయకులు, కళాకారులు ఘంటసాల పాటలను పాడి అలరించారు. కార్యక్రమంలో నాగేంద్రప్ప, నారాయణ, భీమప్ప, ప్రభాకర్, దాస్, సుధాకర్, రమణయ్య శెట్టి, గాయకులు బండారి మారెన్న, లీల, వరలక్ష్మి, నాగరాజు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి రథోత్సవం



భక్తజన సందోహం మధ్య కదులుతున్న రథం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో కొలువైన రంగనాథ స్వామి రథోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. సాయంత్రం భక్తజన సందోహం మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి భక్తులు నందికోల సేవ చేశారు. ఎస్‌ఐ గోపాల్ పోలీసు బందోబస్తు చర్యలు చేపట్టారు.

28న వాహనాల వేలం

వెల్దుర్తి: తమ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన వాహనాల వేలం ఈనెల 28న నిర్వహించనున్నట్లు డోన్ సెబ్ ఇన్‌స్పెక్టర్ భీమలింగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేషన్ ఆవరణలో జరుగు వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా తమ ఆధార్ కార్డుతో తమ పేరు నమోదు చేసుకొని, ఎంట్రీ పాస్ తీసుకోవాలన్నారు. వివరాలకు 94409 02584 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



స్తంభం నేలవాలడంతో రోడ్డుపై వేలాడుతున్న తీగలు

హొళగుంద: స్థానిక పీహెచ్‌సీ వద్ద ఆదివారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం పడిపోయి తీగలు రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్తంభం రోడ్డు పక్కనే ఉండడంతో ట్రాక్టర్ మరో వాహనానికి దారిచ్చే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి స్పందించి విద్యుత్ శాఖాధికారిణి ఓబులమ్మ, సిబ్బందికి సమాచారమివ్వడంతో సరఫరాను నిలిపివేశారు. తీగలు రోడ్డుపై ఉండడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఏఈ కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం



మృతిచెందిన గంగమ్మ

ఆదోని అర్బన్: మండలంలోని పెండేకల్ గ్రామం నుంచి ఆదోనికి బైకుపై వస్తుండగా నెట్టేకల్ క్రాస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో వృద్ధురాలు గంగమ్మ మృతిచెందింది. గంగమ్మ కుమారుడు గోవింద్ రెడ్డి పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. పెండేకల్ గ్రామం నుంచి ఆదివారం తల్లి గంగమ్మ, కొడుకు గోవింద్‌రెడ్డి బైకుపై పని నిమిత్తం ఆదోనికి వస్తుండగా మార్గమధ్యలో కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డామని తెలిపారు. గంగమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయని, వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందిందని కుమారుడు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



అపస్మారక స్థితిలో రంగస్వామి

ఆదోని రూరల్: మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన రంగ స్వామి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తమ గ్రామంలో మార్చి నెల 2, 3వ తేదీల్లో జరుగుతున్న జల్లి నాగన్న ఉరుసు వేడుకలకు రావాలని ఆస్పరి మండలం బిల్లేకల్ గ్రామంలో బంధువులను ఆహ్వానించాడు. ఆదివారం సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బిణిగేరి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తుది దశకు వంతెన నిర్మాణ పనులు



బ్రిడ్జిపై పూర్తయిన కాంక్రీటు పనులు

నందవరం: తెలంగాణ, ఆంధ్రా సరిహద్దులను కలుపుతూ బంధాలకు వారధిగా నాగులదిన్నె వంతెన వర్ధిల్లింది. 2009 వరద ధాటికి నందవరం మండలం నాగులదిన్నె బ్రిడ్జి కూలిపోయిన విషయం విదితమే. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడంతో దశాబ్దానికిపైగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి పట్టుబట్టి వంతెన నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వంతెనపై కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. తెలంగాణ, ఆంధ్రా ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణాలు చేపడితే పనులు పూర్తవుతాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేసి రాకపోకలకు వీలు కల్పించాలని సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం



సుంకులమ్మవ్వ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నివాసం వద్ద ఆదోని మండలంలోని కపటి, చిన్నహరివాణం గ్రామాల్లో నిర్మిస్తున్న దేవాలయాలకు విరాళం అందజేశారు. కపటి గ్రామంలో సుంకులమ్మవ్వ గుడి నిర్మాణానికి రూ.లక్ష వెయ్యి, చిన్నహరివాణం గ్రామంలో వాల్మీకి మహర్షి ఆలయ నిర్మాణానికి రూ.లక్షా వెయ్యి చొప్పున విరాళాలను ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులకు అందజేశారు. గ్రామాల్లో ఆలయాలు నిర్మించడం వల్ల భక్తి భావం పెరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ధర్మ మార్గంలో మెలగాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న పీఈటీ ఉపాధ్యాయులు

ఆదోని అర్బన్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఏపీ పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య, కబడ్డీ కోచ్ రామన్న క్రీడాకారులకు సూచించారు. ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు చిత్తూరు జిల్లాలోని నగరిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు స్థానిక ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో పది రోజులుగా కబడ్డీ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులకు భోజనాలు, తగిన సౌకర్యాలు కల్పించేందుకు సహకరించిన కిడ్డీస్ పాఠశాల, నేషనల్ పాఠశాల యాజమాన్యం, ఆర్ట్స్ కళాశాల పీడీ కంబిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు పట్టుదలతో క్రీడాస్ఫూర్తి చాటుతూ ఉన్నతంగా రాణించాలన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కోశాధికారి ఆనంద్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ఈరన్న, కిషోర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూల అలంకరణలో దర్శనమిస్తున్న మంగళాంజనేయ స్వామి

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో మంత్రాలయం రాఘవేంద్ర స్వామి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రాలయం మఠంలో వారం రోజులపాటు జరిగిన గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారంతో ఉత్సవాలు ముగిశాయి. మంగరాయ ఆంజనేయ స్వామికి ఫలపంచామృతాభిషేకం, తేనాభిషేకం, వెండి ప్రత్యేక పూల అలంకరణతో పూజలు చేశారు. అలాగే రాఘవేంద్ర స్వామి, ప్రహ్లాద స్వామి, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ జరిగింది. ఆలయ మేనేజర్ రాఘవేంద్ర, పూజారులు గురురాజా ఆచారి, అక్షయ, బ్రాహ్మణసంఘం సభ్యులు పాల్గొన్నారు.

కారులో ఎక్కించుకుని చితకబాదారు



బాధితుడు వడ్రంగి నాగరాజు

ఆదోనిరూరల్: పోలీసులమని చెప్పి కారులో ఎక్కించుకుని తీవ్రంగా దాడి చేసి రోడ్డుపై తోసేసి వెళ్లిపోయారని బాధితుడు వడ్రంగి నాగరాజు వాపోయారు. ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు తెలిపిన వివరాలు.. ఆదోని మండలం పెద్దహరివాణంకు చెందిన నాగరాజు శనివారం రాత్రి 9 గంటల సమయంలో ట్యాబ్లెట్ కోసం బైకుపై మెడికల్ దుకాణానికి వచ్చాడు. అకస్మాత్తుగా కారులో వచ్చిన కొందరు అడ్డగించి సీఐ సార్ పిలుస్తున్నారు కారులో ఎక్కాలని బెదిరించారు. కొంత దూరం వెళ్లాక సెల్‌ఫోన్ లాక్కొని దాడి చేశారు. డబ్బులు ఇస్తావా లేక చంపాలా అని బెదిరించారు. ఆస్పరి మండలం బల్లేకల్ వద్దకు వెళ్లగానే కిందకు తోసేసి వెళ్లిపోయారు. అక్కడ పొలానికి నీరు పెడుతున్న రైతు గమనించి సాయం అందించడంతో అతని సెల్‌ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు.

వివాహేతర సంబంధమే కారణమా ?

వడ్రంగి నాగరాజు మూడేళ్ల క్రితం బెంగళూరులో పనిచేస్తున్న సమయంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు సమాచారం. ఆ మహిళను వదిలేసి మూడేళ్లు కావొస్తోందని, ఆమె సంబంధీకులే కిడ్నాప్ చేసి కొట్టి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇస్వీ పోలీసుల విచారణ

ఘటనపై తాలూకా సీఐ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ జరుపుతున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. బాధితుడి భార్య లక్ష్మీదేవిని విచారించగా.. ఆదోనిలోని వాసు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న నాగరాజు శనివారం పని ముగించుకుని మద్యం తాగి ఇంటికి వచ్చాడని, కాసేపటికి ఫ్రెండ్ ఫోన్ చేశాడని, బయటికి వెళ్లివస్తానని చెప్పి వెళ్లినట్లు ఆమె తెలియజేసింది.